31

# వింత శిక్ష

అనగా అనగా ఒక ఊరిలో ధనరాజు అనే వ్యాపారి ఉండేవాడు.

అతనికి ఇద్దరు భార్యలు. అయితే ... ఆ ఇద్దరు సవతులకు క్షణకాలం కూడా పడేది కాదు. ఈ బాధ పడలేక ధనరాజు డాబా మీద మేడ వేయించి క్రింది భాగంలో పెద్ద భార్యనూ, మేడమీది భాగంలో చిన్న భార్యనూ ఉంచాడు. రోజు విడిచి రోజు ఒక్కొక్క భార్యతో గడుపుతుండేవాడు.

ఒక రోజున ధనరాజు చిన్న భార్య- భర్తకి ఇష్టమైన వంటకాలనెన్నిటినో చేసింది. అవన్నీ కడుపార ఆరగించి ఎంతో ఆనందించాడు ధనరాజు. అతడు ఆ ఆనందంలో ఉండగా, మర్నాడు కూడా తనతోనే ఉండేందుకు ఆమె అతన్ని ఒప్పించింది.

మర్నాటి రాత్రి ధనరాజు ఇంటికి వచ్చాక గుట్టుచప్పుడు కాకుండా పిల్లిలాగా మెట్లెక్కి పైకి వెళ్లబోయాడు. అది గమనించిన పెద్ద భార్య వెనకాలే వచ్చి అతని చెయ్యి పుచ్చుకుని గట్టిగా వెనక్కిలాగింది.

మెట్లపైనున్న చిన్న భార్య ఇదంతా చూస్తూనే ఉంది. వెంటనే ఆమె చెంగున లేడిలాగా వచ్చి భర్త రెండో చెయ్యి పుచ్చుకొని పైకి లాగసాగింది.

ఈ విధంగా భార్యలిద్దరూ అతన్ని పైకి, కిందకీ పందెంలో తాడును లాగినట్లు లాగసాగారు.

ఆరోజు సాయంత్రం చీకటి పడగానే ఒక దొంగ దొంగతనం చేయడానికి ధనరాజు ఇంట్లో ప్రవేశించి ఓ మూల నక్కి కూర్చున్నాడు. అందరూ నిద్రపోయాక వస్తువులను ఎత్తుకుపోవాలని అతని ఆలోచన. కాని, సవతులు కేకలు వేసుకుంటూ పోట్లాడుకుంటుండడంతో ఇరుగు పొరుగు వారంతా వచ్చారు. అంతటితో ఆ దొంగకి దొంగతనం చేయడం కాదుకదా..,



ఇంట్లోంచి బయటికి పోయే అవకాశమే చిక్కలేదు. ధనరాజు నెత్తీ నోరూ కొట్టుకుంటూ సాకులూ, క్షమాపణలూ చెప్పుకుంటున్నా భార్యలిద్దరూ అతను తన వద్దంటే.., తన వద్దనే ఉండాలంటూ... పోట్లాడుకుంటూనే ఉన్నారు.

ధనరాజు ఇంట్లో పోట్లాట ఎంతకీ సద్దుమణగక పోవడంతో ఇరుగు పొరుగువారు కల్పించుకుని ఇద్దరు పెళ్ళాల మధ్య నుంచి ధనరాజుని ఎలాగైతేనేం... విడిపించారు. ఈలోగా వారిలో ఒకరు ఇంటిలో దాక్కున్న దొంగను చూసి కేకలు పెట్టారు. నలుగురూ చేరి ఆ దొంగను పట్టుకుని కొట్టి, కాళ్ళూ చేతులూ కట్టి పడవేశారు.

ఆ మర్నాడు దొంగను తీసుకెళ్ళి రాజుగారి ముందు ప్రవేశపెట్టారు.

జరిగినదంతా విని రాజుగారు దీర్ఘంగా ఆలోచించారు. దొంగ ధనరాజు ఇంట్లో జొరబడ్డాడు కనుక... ఆ దొంగకి ఎటువంటి శిక్ష విధిస్తే బాగుంటుందో ధనరాజునే అడిగితే బాగుంటుందనిపించింది.

రాజు వెంటనే, "ధనరాజా... నీవు ఏ విధంగా ఈ దొంగని శిక్షించమంటే అదే విధంగా శిక్షిస్తాను" అన్నారు.

రాజుగారి మాట విని ధనరాజు ఒక్కక్షణం ఆలోచించాడు.

"నా సలహాను ప్రభువులు వారు కోరేటట్లయితే, ఈ దొంగకి ఇద్దరు భార్యలతో వేగే శిక్ష విధించండి మహాప్రభూ..!" అన్నాడు.

ఆ మాటలు విని సభలో వున్న వారంతా పగలబడి నవ్వారు.

ఆ నవ్వుల మధ్య దొంగ గట్టిగా అరవసాగాడు-"మహాప్రభూ..! నాకు తమరే శిక్ష విధించినా ఫరవాలేదు కాని, ఇద్దరు భార్యలతో బ్రతికి ఉన్నంతకాలం చిత్రహింసలు అనుభవించే శిక్ష మాత్రం వద్దు" అంటూ కన్నీరు కారుస్తూ ప్రాధేయ పడసాగాడు. ఆ క్రితం రాత్రి ఇద్దరు భార్యలతో ధనరాజు పడ్డ బాధను స్వయంగా చూడ్డంతో, అతనికి భయం పట్టుకుంది.

రాజు మళ్ళీ ఆలోచించి చివరగా తన తీర్పుని ప్రకటించాడు.

"ఊహు... వీల్లేదు. నీకు ఒకేసారి ఇద్దరు స్త్రీలతో వివాహం జరిపించి జీవితకాలం నరకం అనుభవించేటట్లు చేయవలసిందే! నీ శిక్ష విన్న వాళ్ళు ఇంకెవరూ దొంగతనానికి కాని, ఇతర నేరాలకి కాని పాల్పడ కూడదు" అంటూ తన తీర్పును వెంటనే అమలు చేయవలసిందిగా ఆజ్ఞాపించాడు.

★★★